ఈనాడు
నారాయణపేట
బుధవారం అక్టోబరు 9, 2024

చెంచులు.. చల్లంగుండాలని..!

ప్రత్యేక వైద్య సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి ● మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ప్రతిపాదనలు సిద్ధం

నల్లమల చెంచుల అభ్యున్నతి, ఆరోగ్యం కోసం ఎన్ని కార్యక్రమాలు ప్రవేశపెట్టినా.. పూర్తి స్థాయిలో అమలవడం లేదు. పోషకాహారం, ఆరోగ్య వసతులు లేక అర్థాంతర మరణాలతో జనాభా తగ్గుముఖం పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో దృష్టి సారిస్తేనే చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

ఈనాడు, మహబూబ్‌నగర్ – న్యూస్‌టుడే, అమ్రాబాద్

● నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ఏడేళ్లలో 620 మంది చెంచులు మృత్యువాత పడ్డారు. వీరిలో 80 శాతం మంది పౌష్టికాహారం, అనారోగ్య సమస్యలతో చనిపోయినవారే ఉన్నారు. చెంచు పెంటల్లో నివసిస్తున్న ఆదివాసీల ఆయు ప్రమాణాలు 50 ఏళ్ల లోపు పడిపోతున్నాయి. పౌష్టికాహార లోపం, రక్తహీనత, సరైన వైద్యం అందకపోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తున్నాయి.

● గతంలో నాటి గవర్నర్ తమిళిసై అప్పాపూర్, బౌరాపూర్ చెంచు పెంటలను దత్తత తీసుకుని గర్భిణులకు పౌష్టికాహారంతోపాటు రాజశ్రీ కోళ్లను ప్రతి కుటుంబానికి 10 చొప్పున అందించారు. బైకు అంబులెన్సులు ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత పర్యవేక్షణ లేకపోవడంతో మళ్లీ ఈ రెండు పెంటల్లో సాధారణ పరిస్థితులొచ్చాయి.

● వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల ఆదివాసీల ఆరోగ్యంపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయగా పలు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలైతేనే చెంచుల ఆరోగ్యం బాగు పడుతుంది.



నల్లమలలోని ఓ చెంచు కుటుంబం

నల్లమలలోని ఈర్లపెంటలో మూడు నెలల క్రితం కాన్పు తర్వాత ఓ చెంచు మహిళ మృతి చెందింది. రక్తహీనత, సరైన వైద్యం అందకపోవడం, పోషకాహార లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. బాలింత మృతి చెందిన కొన్ని రోజులకే శిశువు కూడా మృత్యువాత పడింది. మన్ననూరు ఐటీడీఏ పరిధిలో 88 చెంచు పెంటలున్నాయి. ప్రస్తుతం 8,400 జనాభా ఉంది. ఏటా ఈ జనాభా తగ్గుతుండటం ఆందోళన కలిస్తోంది. అనారోగ్య సమస్యలతోనే చిన్న వయసులో పలువురు మృతి చెందడమే దీనికి కారణం.



నిర్వహణ లేక వృథాగా ఉన్న బైకు అంబులెన్సు

సమీక్షలో చర్చకొచ్చిన అంశాలివీ..

● అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఆస్పత్రుల్లో చెంచుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి. అక్కడికి వెళ్లగానే నేరుగా వైద్యం అందించాలి.

● చెంచు పెంటల్లో బైకు అంబులెన్సుల నిర్వహణకు కావాల్సిన సిబ్బంది, ఇంధన ఖర్చు వంటివి సమకూర్చాలి. వన్యమృగాల సంచారం నేపథ్యంలో బైకు అంబులెన్సుల్లో పెంటల్లోకి వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రత్యేకంగా అంబులెన్సును ఏర్పాటు చేసి సీటీస్కాన్, ఇతర పరీక్షలు నిర్వహించే సామగ్రిని అందుబాటులో ఉంచాలి.

● చెంచు పెంటల్లో ఔషధాల కోసం ప్రత్యేకంగా స్టోర్, డయాగ్నోస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేయాలి. మహిళల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలి.

● జ్వరాలు వస్తే చికిత్స కోసం వైద్య సిబ్బందే చెంచు పెంటల్లో పర్యటించేలా చర్యలు తీసుకోవాలి.

● ఇక్కడ చాలా కుటుంబాలు సారాకు బానిసయ్యాయి. సంపాదన మొత్తం దీనికే ఖర్చు చేస్తున్నారు. అనారోగ్యంతో చిన్నతనంలోనే మృత్యువాత పడుతున్నారు. అచ్చంపేటలోనే డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి వారిలో మార్పు తీసుకురావాలి.

వసతులే లక్ష్యంగా ప్రతిపాదనలు..: నాగర్‌కర్నూల్ డీఎఫ్‌వో, మన్ననూరు ఐటీడీఏ పీవో బాధ్యతలను పర్యవేక్షిస్తున్న రోహిత్ గోపిడి 'ఈనాడు'తో మాట్లాడుతూ 14న చెంచుల ఆరోగ్యానికి కావాల్సిన ప్రతిపాదనలను అందించనున్నామన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి వైద్య సేవలు అందిస్తామన్నారు.

పురపాలిక అభివృద్ధికి తోడ్పాటు: వాకిటి



వేదికపై ఎమ్మెల్యే , పుర ఛైర్‌పర్సన్ పావని, ఉపాధ్యక్షురాలు అఖిల

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : పురపాలిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం పుర ఛైర్‌పర్సన్ బాల్చెడ్ పావని అధ్యక్షతన జరిగిన పురపాలిక సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. పెద్ద చెరువు వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరిస్తానన్నారు. త్వరలో సంత బజారుకు స్థలం కేటాయిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. పార్కు నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో రూ.1.43లక్షల అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఉపాధ్యక్షురాలు అఖిల, కమిషనర్ భోగేశ్వర్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీలో చేతివాటం

అసలే చేప పిల్లల్ని ఆలస్యంగా అందించారు.. పైగా చాలా చిన్నవి ఇచ్చారు.. పంపిణీ కార్యాక్రమాన్ని హంగూ ఆర్భాటంతో నిర్వహించారు. విత్తన చేపలను చూసిన మత్స్యకారుల ముఖాన నెత్తురు లేదు. ఇవి బతుకుతాయని, తమ బతుకులు బాగు చేస్తాయన్న గ్యారంటీ లేదని వాపోతున్నారు.



కొండారెడ్డిపల్లి చెరువులో వదులుతున్న చేప పిల్లలు

న్యూస్‌టుడే– నారాయణపేట న్యూటౌన్

చేప పిల్లల సరఫరాలో గుత్తేదారు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారంటూ జిల్లాలోని మత్స్య కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా చేపపిల్లలు ఇచ్చామని చెప్పుకోడానికే తప్ప ఉపయోగం లేదన్నారు. ముఖ్యంగా పరిమాణం విషయంలో ఒప్పందాల్ని ఉల్లంఘిస్తున్నారని, ఇది ఉత్పత్తి దెబ్బ తీస్తోందన్నారు. ఈ ఏడాది జిల్లాలోని 58 ప్రధాన చెరువుల్లో 41.15 లక్షల ఉచిత చేప పిల్లల్ని వదలాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఈ నెల 7న విడుదల లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు నారాయణపేట మండలం కొండారెడ్డిపల్లి, కొల్లంపల్లి చెరువుల్లో చేప పిల్లల్ని వదిలారు. మత్స్య శాఖ సంబంధిత గుత్తేదారుతో చేసుకున్న ఒప్పందం ప్రకారమైతే ఒక కిలోకు మూడు వందల చేప పిల్లలు తూగాలి. ఒక్కొక్క చేప పిల్ల కనీసం మూడు ఇంచీలు ఎదిగి ఉండాలి. సోమవారం వదిలిన చేప పిల్లల్ని తూకం వేసి చూస్తే కిలోకు 16 వందలు తూగాయి. సైజు ఒక ఇంచీ కూడా లేదు. వీటిని వదిలితే పెద్ద చేపలు అమాంతంగా తినే అవకాశం లేకపోలేదు. అంతే కాకుండా బతుకుతాయన్న గ్యారంటీ ఉండదని కార్మికులు అంటున్నారు.

మొదటే జాప్యం.. ఆపై నాసిరకం

ఈ ఏడాది చేప పిల్లల విడుదలలో తీవ్ర జాప్యం నెలకొంది. నిరుడు ఆరువందల లోపు చెరువుల్లో కోటిన్నర మేరకు చేప పిల్లల్ని వదిలారు. ఈ సారి ఇందులో సగం కూడా వదులడం లేదు. నాసిరకం విత్తనాలు అందజేస్తుండటం కార్మికుల్ని అసంతృప్తికి గురి చేస్తోంది. స్థానికేతరుల్ని గుత్తేదారులుగా ఎంపిక చేస్తే ఇదే పరిస్థితి ఎదురవుతుందని కార్మికులు వాపోతున్నారు. ఇపుడే విడుదల కార్యక్రమం ప్రారంభమైనందున ఇక నుంచి తీసుకొచ్చే చేప పిల్లల్ని ఒప్పందానికి తగ్గ సైజులో ఉండేలా చూడాలని మత్స్య కార్మికులు కోరుతున్నారు

గుత్తేదారును హెచ్చరించాం

పరిమాణం తక్కువ ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. సోమవారం కార్యక్రమం ముగిసిన తర్వాత గుత్తేదారును హెచ్చరించాం. ఇక నుంచి తీసుకొచ్చే పిల్లల్ని ఒప్పందంలో చేసుకున్న పరిమాణానికి అనుగుంగా ఉంటేనే వదిలేందుకు అనుమతిస్తాం.

– వెంకన్న, జిల్లా మత్స్య అధికారి, నారాయణపేట

కాత్యాయనీ నమోస్తుతే!



● నారాయణపేట జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. విభిన్న అలంకరణలతో భక్తులు అమ్మవారిని కొలుస్తున్నారు. ఊట్కూరు మండలం బిజ్వార్ అంబాత్రయ క్షేత్రంలో మంగళవారం అమ్మవారిని కాత్యాయనిగా అలంకరించారు.

● దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జోగులాంబ, కాత్యాయనీ దేవిగా భక్తులకు నేత్రపర్వం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి అభిషేకం, స్పర్శ దర్శనం, జోగులాంబకు కుంకుమార్చనలు, అలాగే యాగశాలలో చండీ హోమం, సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కొలువు పూజ నిర్వహించారు. జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో అమ్మ వారి సన్నిధి నుంచి తీసుకు వచ్చి కొలువు పూజ పూర్తి చేశారు. – న్యూస్‌టుడే, ఊట్కూరు, అలంపూర్



ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాలకు దరఖాస్తులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలోని షెడ్యూల్ కులాల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కజ్జం ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు దశల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉపకార వేతనాలకు మొదటిసారి దరఖాస్తు చేసేకునేవారు, పునరుద్ధరించుకునేవారు ఆధార్, పదో తరగతి వివరాలు సరి చూసుకోవాలన్నారు. ఈ - పాస్ వెబ్‌సైట్‌లో ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చన్నారు ఇంకా ఇబ్బందులు ఉంటే నేరుగా తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోలులో ఏవోలే కీలకం

కలెక్టరు సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, న్యూస్‌టుడే : వరి ధాన్యం కొనుగోళ్లలో వ్యవసాయశాఖ అధికారులే కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. జిల్లాలో ఏర్పాటుచేసిన కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చి విక్రయించేలా ఏఈవోలు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏవోలు, ఏఈవోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్లస్టర్ల వారీగా కొనుగోలు కేంద్రాల పరిధిలో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం అమ్మకానికి వస్తుందనే సమాచారాన్ని ఏఈవోలు నమోదు చేసుకుని, సన్నరకం ధాన్యాన్ని ఏఈవోలు నిర్ధరించి రైతులకు టోకన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో సన్నరకానికి బదులు దొడ్డు రకం కొనుగోలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. గతేడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులకు టోకన్లు ఇవ్వాలని, వర్షానికి ధాన్యం తడిసిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిక్షణ కలెక్టర్ గరిమా నరుల, డీఏవో జాన్‌సుధాకర్, డీసీఎస్‌వో డీఎం దేవదాసు, సహాయ వ్యవసాయశాఖ అధికారులు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు: కొండా సురేఖ



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కొండా సురేఖ

అలంపూర్, న్యూస్‌టుడే: పవిత్రమైన, ప్రాచీన శిల్ప సంపదకు ఆలవాలమైన అలంపూర్ ఆలయాలను అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఇక్కడ జరగనున్న కల్యాణోత్సవానికి మంత్రి మంగళవారం ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రికి ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్త సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు. దేవాలయంలో పూజల అనంతరం టూరిజం వసతిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఆలయం పురావస్తు శాఖ పరిధిలో ఉన్నందున ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర నుంచి కూడా నిధులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేసీఆర్ పుష్కరాలకు వచ్చి ఆలయాల అభివృద్ధికి రూ.వంద కోట్లు మంజూరు చేస్తామని హామీ వచ్చి మరిచిపోయారని విమర్శించారు. అనంతరం ప్రసాద్ పథకం కింద జరుగుతున్న పనులను మంత్రి పరిశీలించారు. త్వరగా పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

● ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులుగా 1,131 మంది ఎంపిక

● నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు



మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తరువాత 1:1 నిష్పత్తితో తుది జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులు ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,131 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వివరాలను డీఈవోల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చారు. ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల నుంచి వారు ఎంపిక చేసుకున్న పోస్టు కోసం డిక్లరేషన్ తీసుకున్నారు. మరో పోస్టులో కూడా ఎంపికైన వారు ఉంటే వారి పేర్లను తొలగించి మెరిట్ జాబితాలో తదుపరి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జిల్లాల వారీగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి ఎంపికైన వారిని కలెక్టర్ కార్యాలయాల వద్దకు చేరుకోవాలని సమాచారం ఇచ్చారు.

అభ్యర్థుల తరలింపునకు 28 బస్సులు..: ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద బుధవారం ఉదయం ఫొటో గుర్తింపు కార్డులు అందజేస్తారు. హైదరాబాద్‌లోని సీఎం సభకు వెళ్లేందుకు అధికారులు 28 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. దసరా సెలవులు పూర్తయ్యేలోగా ఎంపికైన వారికి పాఠశాలలను కేటాయించి సెలవుల తరువాత విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ డీఈవో డా.గోవిందరాజులు తెలిపారు.

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	ఎంపికైన ఉపాధ్యాయులు	ఆర్టీసీ బస్సులు
మహబూబ్‌నగర్	243	06
నాగర్‌కర్నూల్	285	07
జోగులాంబ గద్వాల	172	04
వనపర్తి	152	04
నారాయణపేట	279	07

తుంగభద్రలో 26,330 క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో మంగళవారం 26,330 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 10 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.6 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.1 అడుగులుగా ఉంది.

● సుంకేసుల డ్యాం నుంచి 4 గేట్ల ద్వారా 17,916 క్యూసెక్కులు, కేసీ కాల్వ ద్వారా 2,445 క్యూసెక్కులు మొత్తం 20,361 క్యూసెక్కుల నీటిని అధికారులు మంగళవారం విడుదల చేశారు. డ్యాంలో 1.235 టీఎంసీల పూర్తిస్థాయి నీటి మట్టం నమోదైనట్లు తెలిపారు. ఎగువ నుంచి జలాశయంలోకి 20,365 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నట్లు వివరించారు.

ఈనాడు కథనంపై కలెక్టర్ ఆరా

ధన్వాడ, న్యూస్‌టుడే : గత నెల 27న 'ఈనాడు'లో 'కలప అక్రమ రవాణాకు అడ్డేదీ?' శీర్షికన వెలువడిన కథనంపై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆరా తీశారు. ఈ విషయమై ఈ నెల 4న జిల్లా అటవీ శాఖాధికారిని వివరణ కోరారు. కథనం వచ్చిన మరుసటి రోజే అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. అయితే అప్పటికే వాహనాలు ఏమీ లేకపోవడంతో వేగుల ద్వారా సమాచారం మేరకు గున్ముక్లకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

పంచాయతీ ట్రాక్టర్లకు జియోట్యాగింగ్

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మక్తల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం పంచాయతీ ట్రాక్టర్లకు జియో ట్యాగింగ్ అమర్చినట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. పంచాయతీ ట్రాక్టర్లను సొంత పనులకు వాడుకుంటున్నారనే ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

హెచ్చరించినా.. నిర్లక్ష్యమే

రెండు నెలల్లో పదవీ విరమణ.. అంతలోనే సస్పెన్షన్



ఆర్డీవో నాగరాజు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : విధుల్లో నిర్లక్ష్యం వద్దంటూ కొల్లాపూర్ ఆర్డీవోను పలుమార్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు అప్రమత్తం చేశారు. హెచ్చరికలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆర్డీవో నాగరాజును సస్పెన్షన్ చేస్తూ రెవెన్యూ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధరణి దస్త్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరించటంతో ఓ మాజీ సర్పంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ధరణి విషయంలో ఆర్డీవో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఓఆర్‌సీల జారీ విషయంలో రైతులను ఎక్కువగా ఇబ్బందులకు గురి చేశారన్న ఫిర్యాదులున్నాయి. కార్యాలయంలో ప్రతి చిన్న పనికి డబ్బులు అడుగుతారనే విమర్శలున్నాయి. నాగరాజు మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. కొల్లాపూర్‌లో ఆయన ఏడాది నుంచి ఆర్డీవోగా కొనసాగుతున్నారు. విధుల్లో అలసత్వం, అవినీతి ఆరోపణలతో ఆర్డీవో సస్పెన్షన్ కావడం జిల్లాలో ఇదే మొదటిసారి. వివిధ ప్రాంతాల నుంచి ధరణి సమస్యలను పరిష్కరించాలని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికంగా ఫిర్యాదులు వస్తున్నా.. కొందరు అధికారుల్లో స్పందన లేదు. ప్రతి వారం 90 దరఖాస్తులు వస్తున్నా.. అధికంగా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. ఇటీవలే తహసీల్దార్ల బదిలీలు అయ్యాయి. అంతకు ముందు కొందరు తహసీల్దార్లపై ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. దస్త్రాలను పెండింగ్‌లో పెట్టడం.. బేరం కుదిరిన తర్వాతనే పరిష్కరించేవారనే ఆరోపణలున్నాయి. ఆర్డీవో స్థాయి అధికారిపైనే వేటు పడటంతో జిల్లాలోని రెవెన్యూ సిబ్బందిలో గుబులు మొదలైంది.

కలల కొలువు కైవసం

ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివి అనుకున్నది సాధించారు. కలల కొలువు కైవసం చేసుకున్నారు. ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికవడంతో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా విజేతల మనోగతమిది..

- న్యూస్‌టుడే, బృందం



చిరకాల కల.. నెరవేరిందిలా 2012 డీఎస్సీలో 0.4 శాతం మార్కుల తేడాతో ఉద్యోగావకాశాన్ని కోల్పోయాను. 2017లో ఒక మార్కు తేడాతో అవకాశాన్ని పోగొట్టుకున్నా. అచ్చంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యాయుడిగా చేరాను. ఈసారి ఉద్యోగాన్ని సాధించాలన్న పట్టుదలతో డీఎస్సీకి సిద్ధమయ్యాను. స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) పరీక్షలో నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండో ర్యాంకు సాధించా. కలల ఉద్యోగాన్ని సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఎడ్ల రవి, లత్తీపూర్ (ఉప్పునుంతల)



సంతోషంగా ఉంది: రోజూ 12 గంటలకుపైగా చదివాను. టీజీ డీఎస్సీ 2024లో సోషల్ స్టడీస్‌లో 75.53 మార్కులతో జిల్లా రెండో ర్యాంకు సాధించి టీచర్ పోస్టుకు ఎంపికయ్యాను. సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకోనుండటం మరిచిపోలేను.

- టి రేణుక, గద్వాల



పట్టుదలతో మూడు ఉద్యోగాలు.

. : అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ తీసుకున్నా. గురుకుల పీఈటీ ఉద్యోగానికి ఎంపిక కాగా ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రం అందుకున్నా. వసతి గృహ అధికారి ఉద్యోగానికి కూడా అర్హత సాధించాను. ధ్రువపత్రాల పరిశీలన చేయాల్సి ఉంది. తాజాగా డీఎస్సీలో పీఈటీ ఉద్యోగానికి అర్హత సాధించా.

- మూడావత్ శ్రీనివాస్‌నాయక్, పెద్దాయకుంట తండా(జడ్చర్ల)



హిందీ భాష పండితుడిగా...: మాది నిరుపేద గిరిజన కుటుంబం. 15 ఏళ్లుగా ప్రయివేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ప్రభుత్వ వృత్తి చేపట్టాలన్న పట్టుదలతో నోట్స్ తయారు చేసుకొని చదివాను. ఆన్‌లైన్ తరగతులను ఉపయోగించుకున్నా. బోధనా వృత్తిలో ఉండటంతో కలిసొచ్చింది. రెండో గ్రేడ్ హిందీ భాష పండితుడి ఉద్యోగానికి ఎంపికయ్యాను.

- మూడావత్ రవి, వంకేశ్వరం (పదర)



ఎస్‌జీటీగా.. : మాది పేద వ్యవసాయ కుటుంబం. హైదరాబాద్ నిజాం కళాశాలలో డిగ్రీ, ఖమ్మం ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఈడీ పూర్తి చేశాను. 73.33 శాతం స్కోర్‌తో జిల్లా స్థాయిలో 19వ ర్యాంకు సాధించాను. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా (ఎస్‌జీటీ) ఎంపికయ్యాను.

- నెల్లికంటి హరీశ్, పదర



మొదటి ర్యాంకు రావటం ఆనందంగా ఉంది... : డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 84.37 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు పొందటం ఆనందంగా ఉంది. పాఠశాలలో పని చేస్తూనే, డీఎస్సీకి సిద్ధమయ్యాను.

- గోపాల్, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్



తండ్రి స్ఫూర్తితోనే : నాన్న స్ఫూర్తితో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉపాధ్యాయ పరీక్షలకు సన్నద్ధమయ్యా. డీఎస్సీలో 70.43 మార్కులతో జిల్లా స్థాయిలో 134 ర్యాంకు వచ్చింది. డీఈవో కార్యాలయం నుంచి ఉద్యోగ అర్హత సందేశం రావడంతో చాలా సంతోషంగా ఉంది.

- అనిత, భూత్పూర్



ఉపాధ్యాయుడిగా స్థిరపడాలనే...: 2017 డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం కోల్పోయా. అప్పటి నుంచి పట్టుదలతో సిద్ధమయ్యా. 84 మార్కులతో ఎస్జీటీ తెలుగు మాధ్యమంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించా.

- తుప్పలి శివసాయి, మహబూబ్‌నగర్



కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

భూత్పూర్ : కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. మాది షాద్‌నగర్, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. పోటీ పరీక్షల్లో 66.70 మార్కులతో ఉపాధ్యాయురాలిగా అవకాశం దక్కింది.

- తేజస్విని, అమిస్తాపూర్




మూడో తరంలో కూడా.. : మా తాత ఉపాధ్యాయుడిగా పని చేశారు. తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే. నేను మూడోతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిని. చాలా సంతోషంగా ఉంది. డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో 77.38 మార్కులు సాధించి 24 ర్యాంకు కైవసం చేసుకున్నాను. అమ్మానాన్నల సహకారంతోనే ఈ విజయం సాధించాను.

- నవ్యశ్రీ, న్యూగంజ్, మహబూబ్‌నగర్



లక్ష్యం నెరవేరింది : అమ్మానాన్న చిన్ననాటి నుంచే కూలీ పనులు చేస్తూ నన్ను చదివించారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనే లక్ష్యంతో విద్యాభ్యాసం సాగించా. కొన్ని రోజులు ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన చేస్తూ, సొంతంగా పరీక్షలకు సిద్ధమయ్యా. 77.07 మార్కులతో పాలమూరు జిల్లా కేటగిరిలో 26వ ర్యాంకు సాధించా.

- దోకూరు అనిత, అమిస్తాపూర్



అవమానాలు ఎదుర్కొన్నా.. గత డీఎస్సీలో కొద్ది తేడాతో ఎస్‌జీటీ అవకాశాన్ని కోల్పోయాను. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో చదివాను. ఈ డీఎస్సీలో 70.8 శాతం మార్కులతో 49వ ర్యాంకు సాధించా. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్ఏ (జీవశాస్త్రం) ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నా.

- చింతల కార్తీక్, అచ్చంపేట



మా కుటుంబంలో తొలి ఉద్యోగం.


. : అమ్మనాన్నలు వ్యవసాయం చేస్తారు. నాకు ఇద్దరు తమ్ముళ్లు. 11 గంటల పాటు చదివాను. 78.90 మార్కులతో 16వ ర్యాంకు పొందాను. మా కుటుంబంలో తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేర్చాను.

- శ్వేత, చిన్నదార్‌పల్లి(హన్వాడ)



అమ్మ కష్టాన్ని చూసి ఉద్యోగం సాధించా..: నాన్న మృతిచెందడంతో అమ్మ శకుంతలమ్మ కూలీ పనులు చేస్తూ చదివించారు. అమ్మ కష్టాన్ని చూసి ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చదివాను. ఎస్‌జీటీగా ఎంపికయ్యాను.

- శ్రీకాంత్, పెద్దమారూర్, చిన్నంబావి మండలం



రోజూ ఏడు గంటలు చదివాను...: డీఎస్సీలో ఆంగ్లంలో నాకు జిల్లా మొదటి ర్యాంకు వచ్చింది. 6 నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను రోజు ఏడు గంటలు చదివాను. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా నియామకం సంతోషంగా ఉంది.

- అక్షయ్‌కుమార్, వనపర్తి



నాన్న, అక్కల స్ఫూర్తితో.. : నాన్న, అక్కలా నేను కూడా ఉపాధ్యాయురాలిని కావాలనే కోరిక నెరవేర్చుకున్నాను. డీఎస్సీలో 77.45 మార్కులతో ఓపెన్‌లోనే స్థానిక సంస్థల విభాగంలో స్కూల్ అసిస్టెంట్ గణితంలో మొదటి ర్యాంకు సాధించాను.

- బి.సుమన, మహబూబ్‌నగర్



వనపర్తి వల్లభ్‌నగర్‌లో ధనలక్ష్మి అవతారంలో.. దేవరకద్రలో వాసవీమాత అలంకరణ.. మహబూబ్‌నగర్: వాసవీ మాత ఆలయంలో.. అచ్చంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి అలంకరణ..



అయిజ: కాళికాదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకరణ

తంగేడు పూల సోయగం.. బతుకమ్మ సంబరం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. మండపాల్లో కుంకుమార్చనలు, వాడ వాడలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఉత్సాహంగా కోలాటాలు, దాండియా ఆడారు.

- న్యూస్‌టుడే బృందం



మహబూబ్‌నగర్: తలపై బతుకమ్మతో..



నాగర్‌కర్నూల్ : పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించిన మహిళలు



మహబూబ్‌నగర్: బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు



కొల్లాపూర్ : కోర్టు ఆవరణలో బతకమ్మకు పూజలు చేస్తున్న జడ్జీలు ఆర్‌వీఎస్‌ఎస్ మిథున్ తేజ, జోత్స్న



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కందనూలు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో సంఖ్య 25 జారీ చేసి ప్రభుత్వ పాఠశాలలు ఎత్తివేయడానికి ప్రయత్నాలు చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రతి తండాలో పాఠశాలలు ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, కిరణ్, రామస్వామి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రెజిల్ ఫెలోషిప్‌కు పాలమూరువాసి



డా.జయపాల్

పాలమూరు, న్యూస్‌టుడే : బ్రెజిల్ దేశ ప్రతిష్ఠాత్మక 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్' ఫెలోషిప్‌కు మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండలోని సంతోష్‌నగర్‌కు చెందిన డా. జయపాల్ ఎంపికయ్యారు. గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్‌కు మందులు కొనుక్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా 20 మంది శాస్త్రవేత్తలను ఎంపిక చేయగా ఆసియా నుంచి డా. జయపాల్ ఒక్కరే చోటు సంపాదించారు. ఈ బృందానికి ఆయనే నాయకత్వం వహించనున్నారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ) చేసిన డా. జయపాల్ చైనాలో శాస్త్రవేత్తగా పనిచేశారు. కరోనా కాలంలో భారత్‌కు వచ్చి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో పనిచేశారు. ప్రస్తుతం సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఆచార్యుడిగా కొనసాగుతున్నారు. 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్'కు దరఖాస్తు చేయగా మూడు విడతలుగా అంతర్జాలం ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్‌కు ఎంపికవటం, చాలా దేశాల నుంచి వచ్చే శాస్త్రవేత్తలకు తాను ప్రధాన శాస్త్రవేత్తగా నాయకత్వం వహించనుండటం ఆనందంగా ఉందని డా. జయపాల్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

తనిఖీ చేయకున్నా నియామకమా..?

పేట డీఈవో కార్యాలయం ఎదుట అభ్యర్థుల ఆందోళన





డీఎస్సీ అభ్యర్థుల నిరసనకు మద్దతు తెలుపుతున్న పీఆర్టీయూ టీఎస్, తపస్ జిల్లా అధ్యక్షులు.. డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాలు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలు జరిగాయని, ధ్రువపత్రాల తనిఖీ చేయని వ్యక్తికి ఎలా ఉద్యోగం ఇస్తారని పలువురు అభ్యర్థులు ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ వీరికి మద్దతు తెలిపారు. జాబితా సవరించి అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని, డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన అభ్యర్థులకు అధికారి తీరుతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. భాష పండిత్ (హిందీ)లో ఐదో ర్యాంకు వచ్చిన తనను కాకుండా అర్హత లేని, ధ్రువపత్రాల పరిశీలన చేయని అభ్యర్థిని ఎంపిక చేయడం సరికాదని భారతి అనే మహిళ అవేదన వ్యక్తం చేశారు. జుట్ల కవిత, తిమ్మప్ప అనే అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ సోషల్, తెలుగుల్లో ర్యాంకులు సాధించారు. తాము సోషల్ కోరుకుంటే తెలుగు ఎలా కేటాయిస్తారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో స్థానిక సీఐ శివశంకర్, పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఈవో అబ్దుల్ ఘని చెప్పినా ఆందోళనకారులు తగ్గలేదు. డీఈవో కార్యాలయం ఎదుట రాత్రి వరకు బైఠాయించారు. రాత్రి 9 గంటల వరకు అభ్యర్థులు ఒక్కొక్కరూ జమ అవుతుండటంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

అభ్యర్థులకు అన్యాయం జరిగింది : పీఆర్టీయూ

ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలతో డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,నాయకులు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. డీఈవో తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని వివరించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.

తపాలా శాఖ నిర్లక్ష్యంతో చేజారిన ఉద్యోగం

గత 27న మౌఖిక పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4న చేరిన లేఖ




తపాలా కార్యాలయం వద్ద ఆలస్యంగా వచ్చిన లేఖ చూపుతున్న యువకుడు నాగరాజు

జడ్చర్ల, న్యూస్‌టుడే : యువకుడికి సకాలంలో లేఖ అందకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగ అవకాశం చేజారిన ఘటన జడ్చర్లలో మంగళవారం వెలుగు చూసింది. బాధితులు, తపాలా శాఖ అధికారుల కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం గంగాపూర్‌కు చెందిన బి.నాగరాజు బీఎస్సీ చదివారు. 12 ఏళ్ల క్రితం తండ్రి చనిపోగా తల్లి, చెల్లి ఉన్నారు. ఏ జీవనాధారం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతూనే కుటుంబ పోషణ కోసం స్థానిక పోలేపల్లిలోని ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారు. 2023లో నాగరాజు తెలంగాణ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమిషన్‌లో ఉద్యోగానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలో పరిశీలన కోసం తన విద్యార్హత ధ్రువపత్రాలను పంపించారు. నాగరాజుకు మెరిట్ మార్కులు, జోనల్‌లో ఎస్సీ కోటాలో ఒకే ఉద్యోగం ఉండటంతో మౌఖిక పరీక్షకు అర్హత సాధించారు. సెప్టెంబర్ 27న మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హైదరాబాద్‌లోని కార్యాలయంలో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరు కావాలని కమిషన్ అధికారులు సెప్టెంబరు 4న అభ్యర్థికి స్పీడ్ పోస్టు ద్వారా లేఖ పంపారు. సకాలంలో హాజరుకాకపోయినా, ధ్రువపత్రాలు సరిగ్గాలేకపోయినా ఉద్యోగానికి అర్హత ఉండదని లేఖలో పేర్కొన్నారు. తపాలా శాఖ ద్వారా పంపిన లేఖ గడువు ముగిసిన తర్వాత ఈ నెల 4న అభ్యర్థి నాగరాజుకు అందింది. అతడు అధికారులను సంప్రదించగా మౌఖిక పరీక్షకు హాజరుకాకపోవడంతో మరొకరికి ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగం చేజారిపోవడంతో బాధితుడు మంగళవారం జడ్చర్లలోని తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు బంధువులు, స్నేహితులతో కలిసి వెళ్లి ప్రశ్నించారు. దీనిపై అసిస్టెంట్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గంగాపూర్ గ్రామంలో లేఖలు పంపిణీ చేసే శ్రీకర్ గత నెల 24న ఉద్యోగానికి రాజీనామా చేయటంతో మరో వ్యక్తి సర్దార్‌కు ఆ బాధ్యత అప్పగించామని పేర్కొన్నారు. గత నెల 18న అందించినట్లు తమ సిబ్బంది చెబుతున్నా అందులో నిజం లేదని, ఈ నెల 4వ తేదీనే అందినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. సకాలంలో లేఖ అందించకపోవడానికి కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగం చేజారడంతో బాధితుడు, కుటుంబ సభ్యులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

మాట వినడంలేదని మట్టుబెట్టాడు

భార్యను సుత్తితో బాది చంపిన భర్త



క్రిష్ణవేణి

నార్సింగి, న్యూస్‌టుడే: భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని, తన మాట వినడం లేదని కోపం పెంచుకున్న భర్త నిద్రిస్తున్న ఆమెను సుత్తితో కొట్టి దారుణంగా హత్య చేసిన ఉదంతం హైదరాబాద్‌లోని హైదర్షాకోట్ మాధవీనగర్‌లో వెలుగు చూసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరిక్రిష్టారెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన శ్రీనివాస సాగర్, క్రిష్ణవేణి(32) దంపతులు జీవనోపాధి కోసం వలసవచ్చి హైదర్షాకోట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. తనను నిర్లక్ష్యం చేస్తోందని, చెప్పిన మాట వినటం లేదని భార్యపై శ్రీనివాస సాగర్ ద్వేషం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య తలపై సుత్తితో బాదడంతో ప్రాణాలు కోల్పోయింది. అనంతరం నిందితుడు ఇద్దరు పిల్లలతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి

ధరూర్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేవులపల్లి గ్రామంలో ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అబ్దుల్ షుకూర్ కథనం మేరకు. . రేవులపల్లిలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలు డీజే సౌండ్ సిస్టమ్‌తో బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో డీజే సౌండ్ తక్కువగా పెట్టాలని కృష్ణవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బతుకమ్మ ఊరేగింపు నిర్వాహకులకు కృష్ణవర్ధన్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఆర్మీజవాన్ మణివర్ధన్ తమ్ముడిపై కృష్ణవర్ధన్ దాడి చేశారు. విషయం తెలుసుకున్న మణివర్ధన్ బతుకమ్మ సంబరాల వద్దకు వచ్చి వారించటానికి ప్రయత్నించాడు. కోపోద్రిక్తుడైన కృష్ణవర్ధన్ సమీపంలో ఉన్న తన ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి మణివర్ధన్‌పై దాడి చేశాడు. మణివర్ధన్‌కు తీవ్ర గాయాలు కావటంతో గద్వాల ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకు హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇనుప కడ్డీ గుచ్చుకుని ఒకరి మృత్యువాత

ఇటిక్యాల, న్యూస్‌టుడే: ఇనుప గ్రిల్ కడ్డీ గొంతుకు కుచ్చుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎర్రవల్లిచౌరస్తాలో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. గద్వాల మండలం బసాపురం గ్రామానికి చెందిన కె.క్రిష్టారెడ్డి(68) ఉద్యోగ విరమణ అనంతరం కొత్తకోటలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం ఎర్రవల్లిలో బంధువుల వద్దకు వచ్చాడు. జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ వద్ద మూత్రవిసర్జన చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గ్రిల్‌పై పడ్డాడు. గొంతు నుంచి కడ్డీ తల భాగంలోకి చొచ్చుకుపోగా అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. అప్పన్నపల్లికి చెందిన పెంటయ్య గౌడ్(38)కు వెనుకా ముందు ఎవరూ లేకపోవటం, కటిక పేదరికంతో జీవితంపై విరక్తి చెంది అప్పన్నపల్లి వంతెన సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836



? అమీన్‌పూర్‌లో మురుగు కాల్వ నుంచి తీసిన చెత్తను కొన్ని రోజులుగా అలాగే వదిలేయడంతో కాలువలో పడిపోతోంది. పూడిక తీసి కూడా ఉపయోగం ఉండటం లేదు.
- శంకర్, అమీన్‌పూర్.

✔ తడి ఆరిన వెంటనే తొలగించేలా చూస్తాం.
-అశోక్, పంచాయతీ కార్యదర్శి



? పెద్దజట్రంలో వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోంది.
- రాము, పెద్దజట్రం.

✔ క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి, సమస్య పరిష్కరిస్తాం.
- శ్రీనివాసులు, విద్యుత్తు ఏఈ

? ఊట్కూరు పెద్దచెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే కాల్వలు ధ్వంసమై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీ సీజన్ నేపథ్యంలో మరమ్మతులు చేపట్టాలి.
- రాంచందర్, రైతు, ఊట్కూరు.

✔ గతంలో మిషన్ భగీరథ పనులు చేపట్టిన గుత్తేదారు పనులు మధ్యలో ఆపేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.
- వెంకటేశ్, నీటిపారుదలశాఖ ఏఈ

- న్యూస్‌టుడే, ఊట్కూరు

తెరపై ఈనాడు

మనోహర్ 70 ఎంఎం : దేవర. వెంకటరమణ: దేవర
మహేశ్వర 35 ఎంఎం : స్వాగ్. వనయాంబ : దేవర
- న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్), కోస్గి గ్రామీణం, మక్తల్ గ్రామీణం

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్) న్యూస్‌టుడే : టమాట రూ. 70, వంకాయలు రూ. 60, ముల్ల వంకాయలు రూ60, ఆలుగడ్డ రూ. 50, కాకరకాయ రూ. 80, క్యారెట్ రూ. 70, బెండకాయలు రూ. 50, బీరకాయలు రూ. 70, దొండకాయలు రూ. 60, పచ్చిమిర్చి రూ. 40, చిక్కుడు రూ. 60, పెద్ద చిక్కుడు రూ. 90, గోకరకాయ రూ. 70, క్యాప్సికం 70, బీన్స్ 90, క్యాలీఫ్లవర్ రూ. 80, దోసకాయ రూ. 60, క్యాబేజీ రూ. 40, ఉల్లి రూ. 70, చింతపండు రూ. 120.

దుర్గామాతను దర్శించుకున్న ఎస్పీ

నారాయణపేట, న్యూస్‌టుడే : సింగారంలో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహాన్ని మంగళవారం ఎస్పీ యోగేశ్‌గౌతం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు తీసుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, శాంతియుతంగా దేవి నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సకల జనుల సమ్మె కాలంలో ఆర్టీసీ బస్సులు అడ్డుకున్నారంటూ 27 మంది ఉద్యోగులపై కేసులు నమోదు చేశారని, ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులు ప్రభుత్వం ఎత్తివేయాలని తెలంగాణ పింఛన్ దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సాయిలుగౌడ్, జిల్లా కార్యదర్శి కె.బాలకిషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసులు నమోదు చేసిన వారిలో చాలా వరకు ఉద్యోగ విరమణ చేశారని, ఈ వృద్ధాప్య సమయంలో న్యాయస్థానాల చుట్టూ తిరగడం బాధాకరమన్నారు. కేసులు నమోదు చేయబడిన వారు తమ వ్యక్తిగత సమస్యపై కాకుండా తెలంగాణ సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్నారని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునేలా చూడాలన్నారు.

ఆసుపత్రి ఎదుట కార్మికుల ఆందోళన



ఆసుపత్రిలో సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేయని దొంగతనం తమపై మోపేలా నర్సు అనుచితంగా మాట్లాడారని మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డ్, పేషెంట్ కేర్, పర్యవేక్షకులు తదితరులు నిరసన వ్యక్తం చేశారు. మాతాశిశు విభాగంలోని ప్రసూతి గదిలో ఓ మహిళ చేతిలోని బంగారం గొలుసు మాయమైందని ఆమె ఆగ్రహం వ్యక్తంచేసింది. సీసీ టీవీ పుటేజీలో చూడగా, అందులో శిక్షణ పొందుతున్న విద్యార్థిని దాన్ని తీసి మరో గదిలో భద్రపరిచినట్లు కనిపించింది. కానీ ఈ విషయం తెలియని నర్సు పారిశుద్ధ్య సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని వారంతా ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎవరినీ పర్యవేక్షకుల గదిలోకి పంపకుండా గేట్ వద్ద నిలువరించారు. సమాచారం అందుకున్న సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ కార్మికులతో మాట్లాడి ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనకు చెప్పాలని సూచించారు. మీ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని, నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు చేయరాదని కోరారు.









ధన్వాడ కర్రెమ్మ ఆలయంలో .. బీసీ కాలనీలో లలితా త్రిపుర సుందరిగా.. బాలుర ఉన్నత పాఠశాలలో లక్ష్మీదేవిగా.. రజక మండపంలో ధనలక్ష్మి.. కోస్గిలో మహాలక్ష్మి అవతారంలో చౌడేశ్వరీ దేవి.. పెద్ద చింతకుంటలో రూ. 11,11,111లతో అలంకరణ.. మక్తల్ పట్టణం: రూ.1,91,91,919 కరెన్సీతో లక్ష్మీదేవిగా వాసవీమాత



ధన్వాడ: అంబా భవానీ ఆలయంలో మహిళల పూజలు

జగన్మాతా.. బహురూపిణీ

దేవీ శరన్నరాత్రుల ఉత్సవాలను వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం అన్నపూర్ణ, కాళికాదేవి, ధాన్యలక్ష్మి, రాజరాజేశ్వరి, మహాలక్ష్మీదేవి ఇలా పలు రూపాల్లో కనిపించారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. వేకువజామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

-న్యూస్‌టుడే బృందం



దామరగిద్ద: బోనాల సంబరాల్లో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి











నారాయణపేట: కోటకొండ నగరేశ్వర ఆలయంలో శాకంబరిగా.. ధన్వాడ మారుతీనగర్‌లో కుంకుమార్చన.. దామరగిద్ద: శాకంబరిగా వాసవిమాత.. అలంకరణతో గజలేశ్వరి.. శక్తిపీఠంలో లలితా త్రిపుర సుందరిగా.. బ్రహ్మణవాడిలో మహాలక్ష్మిగా.. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో దుర్గామాతగా.. అశోక్ నగర్ కాత్యాయనిదేవిగా.. మద్దూరు: నాగిరెడ్డిపల్లిలో దుర్గామాత

పెరటి కోళ్ల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : పెరటికోళ్ల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మహిళా సంఘం కార్యాలయంలో లబ్ధిదారులకు కోళ్లను అందజేశారు. కొత్త ప్రభుత్వం మహిళల ఉపాధికి ఏఏ కార్యక్రమాలు చేపడుతున్నదీ వివరించారు. సొసైటీ ఛైర్మన్ తూము భీంరెడ్డి, డీపీఎం రామునాయక్, ఎంపీడీఓ శ్రీధర్, ఏపీఎం నారాయణ, సమాఖ్య అధ్యక్షురాలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో మెట్ట భూములు సస్యశ్యామలం



మాగనూరులో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో రూ.4,350 కోట్ల వ్యయంతో మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టి, కృష్ణా జలాలతో ఈ ప్రాంతాన్ని సస్యశామలం చేస్తామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఊట్కూరు రైతు వేదిక వద్ద మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. మక్తల్- నారాయణపేట రహదారి మరమ్మతులు చేపడతామన్నారు. 9 నెలల వ్యవధిలో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. తహసీల్దార్ చింత రవి, కాంగ్రెస్ నాయకుడు డి.విఘ్నేశ్వర్‌రెడ్డి, సి.సూర్యప్రకాశ్ రెడ్డి, ఎం.మణెమ్మ, రాఘవేంద్రా రెడ్డి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, నాయకులు గణేష్‌కుమార్, చెన్నయ్యగౌడ్, కూసురు రాజు, కుర్వ రమేష్ పాల్గొన్నారు.

కృష్ణా, న్యూస్‌టుడే : మంగళవారం మాగనూరు, కృష్ణా మండల కేంద్రాలలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులుకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రెండులక్షల లోపు రుణాలు మాఫీ చేయడం జరిగిందని మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సిలండర్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాగనూరు, కృష్ణా తహసీల్దార్లు సురేశ్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయితీ గ్యాస్ ధ్రువపత్రాల పంపిణీ

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మక్తల్ పురపాలిక ఆవరణలో రాయితీ సిలిండర్ల ధ్రువపత్రాలు లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీహరి అందించారు. పుర ఛైర్‌పర్సన్ బాల్చేడ్ పావని, వైస్ ఛైర్‌పర్సన్ అఖిల, లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా జములమ్మ



దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా నడిగడ్డ ఇలవేల్పు జమ్మిచేడు జములమ్మ అమ్మవారు ఆరోరోజైన మంగళవారం భక్తులకు ధనలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ. 6,66,666 కరెన్సీతో వైభవంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం


బాలలను పొలం పనులకు తీసుకెళ్తే చర్యలు

ఊట్కూరు, న్యూస్‌టుడే : దసరా సెలవుల నేపథ్యంలో పిల్లలను పొలం పనులకు తీసుకెళ్తే చట్టపరంగా చర్యలు తప్పవని బాలల సంరక్షణ సిబ్బంది శ్రావణ్, సుజాత అన్నారు. పొలం పనులకు బాలలను తీసుకెళ్లే వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించి మాట్లాడారు. వాహనాల్లో పరిమితికి మించి జనాలను ఎక్కించి, ప్రమాదభరితంగా కూర్చోబెటడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసుశాఖ నుంచి చెన్నరాయుడు, బషీర్, సామాజిక కార్యకర్తలు అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నిరసన ర్యాలీని విజయవంతం చేయండి: ఎమ్మార్పీఎస్

ఊట్కూరు, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టాన్ని నిరసిస్తూ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తామని రాష్ట్ర నాయకుడు డీకే నరసింహా మాదిగ తెలిపారు. ర్యాలీకి మేధావులు, ఎమ్మార్పీఎస్ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు భారీగా తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా, మండల నాయకులు రాజు, శంకర్, అశోక్, మహేశ్, జగదీష్, అర్జున్, బాలరాం, పోలప్ప, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోండి



గోడపత్రికను విడుదల చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ జారీ చేసిన లీగల్ ఎయిడ్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గోడపత్రికను విడుదల చేశారు. టోల్ ఫ్రీ నంబరు ప్రచారం చేయడానికి జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో గోడపత్రిక అతికిస్తామన్నారు.

అసంపూర్తి దారులు.. అవస్థల్లో జనులు



మెటల్‌కే పరిమితమైన అంత్వార్ రోడ్డు

న్యూస్‌టుడే, ధన్వాడ

జిల్లాలో పలు మండలాల్లో తారురోడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రారంభించిన పనులు చాలాకాలం నుంచి పూర్తికాలేకపోతుండటం జిల్లావాసుల్ని ఆందోళన కలిగిస్తోంది. చేపట్టిన పనులకు బిల్లులు రాలేకపోవడమే కారణం. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేసిన మేరకైనా బిల్లులు వస్తే చాలన్న అభిప్రాయంతో మిగతా పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ఇష్టపడటంలేదు. చేపట్టిన పనుల పరిస్థితి ఇలా ఉంటే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులను చేపట్టలేకపోతుండటంతో జిల్లా వాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ధన్వాడలో జరిగిన సమీక్ష సమావేశంలో పలు గ్రామాల ప్రజలు రహదారుల మరమ్మతుల విషయమై ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ప్రతిపాదనలు పంపించామని అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు.

- హన్మన్‌పల్లి నుంచి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణార్థం 8 ఏళ్ల క్రితం ప్రభుత్వం రూ.1.19 కోట్ల నిధులను కేటాయించింది. పనులు చేపట్టిన గుత్తేదారు చెట్ల తొలగింపు, రోడ్డు వెడల్పు తో పాటు కంకర పరిచే పనుల్ని పూర్తి చేశారు. తారు వేస్తున్న సమయంలో కొంతమంది రైతులు రోడ్డు తమ పొలాల మీదుగా వెళ్లిందని కోర్టుకు వెళ్లారు. పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కోర్టు సమస్య తీరి రెండేళ్లు కావస్తున్నా తారు పనులు మొదలు కావడంలేదు. .
- నారాయణపేట పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి అంత్వార్ ఊరిలోకి వరకు బీటీ రోడ్డు మంజూరైంది. పనులు మొదలెట్టిన గుత్తేదారు మెటల్ రోడ్డు పరిచి చేతులెత్తేశాడు. రెండేళ్లు కావస్తున్నా బీటీ పనుల్ని మొదలు పెట్టడంలేదు. చేసిన పనులకు బిల్లు రాలేదన్న కారణంతో పాటు ప్రభుత్వం మారడంతో చేసిన ఖర్చుకు గ్యారంటీ లేదనుకున్నారు.
- దామరగిద్ద మండలం ఆశన్‌పల్లి నుంచి ముస్తాపేట్ రోడ్డు కంకరకే పరిమితమైంది. బీటీగా మార్చేందుకు గత ప్రభుత్వం నిధులు కేటాయించగా మెటలింగ్ పనులు పూర్తి చేసిన గుత్తేదారు బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా నిలిపేశారు. ఉలిగుండం నుంచి నర్సాపూర్, దామరగిద్ద నుంచి సజనాపూర్ వరకు బీటీ రహదారుల పునర్నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులొచ్చినా పనులు మాత్రం ఇంకా మొదలు కాలేదు.
- మక్తల్ మండలం దండు నుంచి రామసముద్రం వరకు మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. పూర్తి చేయాలని ఆయా గ్రామస్థులు పదే పదే మొరపెట్టుకుంటున్నా బిల్లులు రాలేదన్న కారణంతో గుత్తేదారు పూర్తి చేయడంలేదు.

ఘనంగా తాయమ్మ దేవి బోనాలు



పగిడిమారిలో బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : పగిడిమారిలో మాదాసి కుర్వ రైతుల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గ్రామ దేవత తాయమ్మ దేవి బోనాల జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు డప్పు వాయిద్యాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పూజించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాదాసి కుర్వ సంఘం పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కొత్త ఠాణా భవనం పరిశీలన



నూతన ఠాణా భవన పనులను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేశ్‌గౌతం

నారాయణపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పేట మండలం అప్పక్‌పల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న కొత్త గ్రామీణ ఠాణా భవనాన్ని ఎస్పీ యోగేశ్‌గౌతం మంగళవారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని సూచించారు. ప్రజలకు సమర్థంగా సేవలు అందించేందుకుగాను త్వరలోనే భవనం ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్ఐ రాముడు, హౌసింగ్ ఏఈ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంతో మభ్యపెట్టొద్దు: కాంగ్రెస్

మద్దూరు, న్యూస్‌టుడే: కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నరని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి వెల్లడించారు. పోలేపల్లి ఫార్మా పరిశ్రమ వద్దంటూ భారాస నాయకులు తలపెట్టిన పాదయాత్రను తప్పుబట్టారు. ప్రజలను మభ్యపెట్టి, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. నాయకులు, నిరుద్యోగులు, యువత, మేధావులు బుధవారం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం దగ్గరకు వచ్చి రేవంత్‌రెడ్డి తలపెట్టే అభివృద్ధికి మద్దతు ప్రకటించాలని పిలుపునిచ్చారు. నాయకులు సంజీవ్‌కుమార్, జగంబాబు, ముద్ది భీములు, మహేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పేటలో భాజపా సంబరాలు

నారాయణపేట, న్యూస్‌టుడే : హరియాణ రాష్ట్రంలో భాజపా గెలుపొందడంపట్ల మంగళవారం పేటలో భాజపా ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో నాయకులు టపాసులు కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రనేత నాగురావు నామాజీ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సత్యారఘుపాల్, మదన్, నందు నామాజీ, రఘు, వెంకటయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు, న్యూస్‌టుడే: మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఛైర్మన్ నర్సిములు కోరారు. మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన 155 మందికి 3 వేల పెరటి కోళ్లను మంగళవారం పంపిణీ చేశారు. స్త్రీనిధి పథకం ద్వారా లబ్ధిదారులకు 60 పాడి పశువులను పంపిణి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీవో నరసింహారెడ్డి, నాయకులు సతీష్, సంజీవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా అవస్థలు!



నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి ఆత్మకూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. జాతీయ రహదారి మొదలు ఎక్లాస్‌పూర్ గేటు వరకు ఉన్న దాదాపు 10 కిలోమీటర్ల రోడ్డు నరక ప్రాయంగా మారింది. తారు లేచిపోయి, కంకర తేలి, గోతులు పడి, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు త్వరితగతిన స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

మక్తల్ పట్టణంలోని రాయచూరువైపు వెళ్లే జాతీయ రహదారిపక్కన చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి పెంచిన హరితహారం మొక్కలకు సైతం రక్షణ లేకుండాపోతోంది. ఈ విషయమై పుర కమిషనర్ భోగేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం



చెరువుకట్టపై ముళ్ల పొదలు తొలగించాలి



పులిమామిడి నుంచి చిన్నపొర్ల గ్రామానికి వెళ్లే మార్గంలోని చెరువు కట్టపై ముళ్ల పొదల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. వాహనాలపై వెళ్లేవారికి కళ్లకు తగులుతున్నాయని వాపోయారు. చర్యలు చేపట్టాలని కోరారు.

- న్యూస్‌టుడే, ఊట్కూరు

జాతీయస్థాయిలో రాణించాలి



రాఘవేందర్‌ను సన్మానిస్తున్న ఓబ్లాపూర్ గ్రామస్థులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : ఓబ్లాపూర్ గ్రామానికి చెందిన బి.తిమ్మయ్య కుమారుడు రాఘవేందర్ దామరగిద్ద గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో అండర్-14 విభాగంలో 34వ రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఓబ్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో విద్యార్థికి శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని, ఉన్నతంగా రాణించాలని కోరారు. మాజీ ఉపసర్పంచి వెంకటేశ్ గౌడ్, నాయకులు బాలయ్య, శివశంకర్, లింగయ్య గౌడ్, గోవర్ధన్ రెడ్డి, వెంకటప్ప, హన్మంతు, రాఘవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ: నలుగురికి గాయాలు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రెండు కార్లు ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటన పట్టణంలోని పెద్ద చెరువు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ భాగ్యలక్ష్మీ రెడ్డి కథనం ప్రకారం ఊట్కూరు మండలం బిజ్వార్‌కు చెందిన కొల్లంపల్లి నారాయణ కర్ణాటకలోని దేవసుగూర్‌లో ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకొని మంగళవారం ఉదయం బిజ్వార్‌కు బయలుదేరాడు. హైదరాబాద్‌కు చెందిన మహిమే మండల్ కారులో హైదరాబాద్ నుంచి గోవాకు బయలుదేరారు. మక్తల్ చెరువుకట్ట వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి.